بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 19 June 2026 (Telugu)

## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప ఆదర్శమైన దాతృత్వం, ఉదారత ఆధారంగా వారి సల్లల్లాహు అలైహి వసల్లం అద్భుత ప్రవర్తనల ఆసక్తికర ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 19.06.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రే) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దాతృత్వం, ఉదారతకు సంబంధించిన కొన్ని కథనాలను నేను సమర్పింతును.

ఒక కథనంలో హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ రజియల్లాహు అన్హు ఇట్లు ఉల్లేఖించారు, అన్సార్‌లలోని కొందరు వ్యక్తులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఏదో ఒకటి అడిగారు. ప్రవక్త గారు వారికి ఇచ్చారు. వారు మళ్ళీ అడిగారు, ప్రవక్త గారు మళ్ళీ ఇచ్చారు. వారు తిరిగి అడగ్గా ప్రవక్త గారు మళ్ళీ ఇచ్చారు, చివరికి ఆయన వద్ద ఉన్నదంతా అయిపోయింది. అప్పుడు ప్రవక్త గారు ఇలా అన్నారు. నా వద్ద ఉన్న ఏ సంపదనైనా నేను మీ నుండి దాచిపెట్టను. ఎవరైతే ఇతరులను యాచించకుండా ఉంటారో, అల్లాహ్ వారిని కాపాడుతాడు. ఎవరైతే ఇతరులపై ఆధారపడకుండా ఉండాలని కోరుకుంటారో, అల్లాహ్ వారిని సంతృప్తి కలిగినవారిగా చేస్తాడు. ఎవరైతే ఓర్పు వహిస్తారో, అల్లాహ్ వారికి మరింత సహనాన్ని ప్రసాదిస్తాడు. ఓర్పు కంటే మెరుగైన, విశాలమైన బహుమతి ఎవరికీ ఇవ్వబడలేదు.

హజ్రత్ ఇబ్నె ఉమర్ రజియల్లాహు అన్హు ఇట్లు ఉల్లేఖించారు. మేము ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి ఒక ప్రయాణంలో ఉన్నాము. నేను ఒక నియంత్రణ లేని ఒంటెపై స్వారీ చేస్తున్నాను, అది ఇతర సవారీల కంటే ముందుకు దూసుకుపోతుండేది. హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు దానిని ఆపుతూ, గద్దిస్తూ ఉండేవారు. ఇది చూసి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఒంటెను నాకు విక్రయించదని అన్నారు. హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు ఇది మీదే ప్రవక్తా! అని మనవి చేశారు. దానికి ప్రవక్త గారు లేదు, దీనిని నాకు విక్రయించు అని అన్నారు. దాంతో ఆయన ఆ ఒంటెను ప్రవక్త గారికి అమ్మేశారు. ఆ తర్వాత మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. ఓ అబ్దుల్లా బిన్ ఉమర్! ఇప్పుడు ఈ ఒంటె నీదే. దీనితో నువ్వు ఏం చేయాలనుకుంటే అది చేయి.

హుజూరె అన్వర్ ఇలా అన్నారు: బహుమతి ఇవ్వడానికి కూడా ఒక పద్ధతి ఉంటుంది. ఆ తర్వాత ఆయన (స) ఇలా కూడా వివరించారు: "ఇది ఒక జంతువు మాత్రమే. ఒకవేళ ఇది ఇతర సవారీల కంటే ముందుకు దూసుకుపోతే అందులో తప్పేమీ లేదు." ఇప్పుడు ఈ ఒంటెను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొనుగోలు చేశారు కాబట్టి, ఒకవేళ ఇది ఇతర సవారీల కంటే ముందుకు వెళ్ళినా, ప్రవక్త గారి ఒంటె అందరికంటే ముందుకు వెళ్ళిందని అంటారు.

ఒక యుద్ధం (గజ్వా) సమయంలో హజ్రత్ జాబిర్ రజియల్లాహు అన్హు ఒంటె బాగా అలసిపోయి,

నెమ్మదిగా నడుస్తుండెను. దీనివల్ల ఆయన సైన్యం కంటే వెనుకబడిపోయారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆయన వద్దకు వచ్చి క్షేమసమాచారాలు అడిగారు. హజ్రత్ జాబిర్ రజియల్లాహు అన్హు తన ఒంటె అలసట గురించి చెప్పారు. అప్పుడు ప్రవక్త గారు తన వద్ద ఉన్న ఒక కర్రతో ఆ ఒంటెను కొద్దిగా తోలి, ఇప్పుడు దీనిపై స్వారీ చేయి అని చెప్పారు. హజ్రత్ జాబిర్ (రజి) ఇలా ఉల్లేఖించారు: నేను దానిపై స్వారీ చేశాను. ఆ ఒంటె ఎంత వేగంగా పరిగెత్తడం ప్రారంభించిందంటే, అది దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సవారీ కంటే కూడా ముందుకు దూసుకుపోసాగింది. దానితో నేను దానిని ఆపవలసి వచ్చింది. ఆ తర్వాత ప్రవక్త గారు నన్ను 'నువ్వు వివాహం చేసుకున్నావా?' అని అడిగారు. నేను 'అవును' అని మనవి చేశాను. అప్పుడు ప్రవక్త గారు చూడు, నువ్వు త్వరలోనే నీ ఇంటికి చేరుకో బోతున్నావు. అక్కడికి చేరుకున్నప్పుడు వివేకంతో, జాగ్రత్తతో వ్యవహరించు. ఇంట్లో అందరితో సత్ప్రవర్తనతో మెలగాలి' అని చెప్పారు. ఆ తర్వాత ఆయన నీ ఈ ఒంటెను నాకు అమ్ముతావా? అని అడిగారు. నేను అవును, అమ్ముతాను అని చెప్పగా, ఆయన దానిని నా నుండి ఒక 'ఊకియా' (ఆనాటి నాణెం) వెండికి కొనుగోలు చేశారు. ఆ తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నాకంటే ముందే మదీనా చేరు కున్నారు, నేను మరుసటి రోజు ఉదయం చేరుకున్నాను. ప్రవక్త గారు నాతో నీ ఒంటెను ఇక్కడే వదిలి, మసీదులోకి వెళ్లి రెండు రకాతుల నమాజ్ చదువుకో అని చెప్పారు. నేను లోపలికి వెళ్లి నమాజ్ చదువు కున్నాను. అప్పుడు ప్రవక్త గారు హజ్రత్ బిలాల్ రజియల్లాహు అన్హుతో ఇతనికి ఒక ఊకియా వెండి ఇవ్వండని చెప్పారు. హజ్రత్ బిలాల్ త్రాసును కొద్దిగా మొగ్గు చూపి దానికంటే కొంచెం ఎక్కువే ఇచ్చారు. ఆ తర్వాత నేను వెనుతిరిగి వెళ్ళిపోతుండగా, ప్రవక్త గారు జాబిర్‌ను నా ముందుకు రమ్మనండి అని చెప్పారు. ఆయన నాతో నీ ఒంటెను నువ్వే తీసుకో అలాగే దీని ధర (వెండి) కూడా నీదే అని చెప్పారు. హజ్రత్ జాబిర్ రజియల్లాహు అన్హు ఇలా అన్నారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రసాదించిన ఆ బహుమతిలో ఎంతటి శుభం కలిగిందంటే, ఆ ఒంటె హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు ఖిలాఫత్ కాలం వరకు జీవించే ఉంది.

ప్రవక్త గారి ఆదర్శవంతమైన వ్యక్తిత్వం, శిక్షణ, పవిత్ర శక్తి ప్రభావం అనుచరులందరిపై ఎంతగానో ఉండేది. హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా పై కూడా ఈ ప్రభావం గాఢంగా ఉండేది, అందువల్లనే ఆమె ఎటువంటి కొరత లేదా పేదరికం వస్తుందనే భయం లేకుండా తన సంపదనంతటినీ వారికి అంకితం చేసేశారు. దీనికి సంబంధించిన ఒక ఉల్లేఖనం ఇలా ఉంది. ఒకసారి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఖదీజా (రజి) వద్దకు విచ్చేశారు, అప్పుడు ఆయన కొంత ఆందోళనగా కనిపించారు. హజ్రత్ ఖదీజా (రజి) ఏమైంది? అని అడిగారు. దానికి ప్రవక్త గారు ఇది కరువు కాలం. ఒకవేళ నేను ఈ సంపదను ఖర్చు చేస్తే నీ సంపద ముగిసిపోతుందేమోనని నీ పట్ల సంకోచంగా ఉంది, ఒకవేళ నేను ఖర్చు చేయకపోతే అల్లాహ్‌కు భయపడుతున్నానని బదులిచ్చారు. హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అహు ఈ సంఘటనను వివరిస్తూ ఇలా అన్నారు: అప్పుడు హజ్రత్ ఖదీజా (రజి) దీనార్లను (బంగారు నాణేలను) బయటకు తీసి అక్కడ ఒక పెద్ద కుప్పగా పోశారు. ఆ సంపద ఎంత ఎక్కువగా ఉందంటే, ఆ కుప్ప కారణంగా నా అవతలి వైపు ఎవరు కూర్చున్నారో కూడా నాకు కనిపించలేదు. ఆ తర్వాత హజ్రత్ ఖదీజా (రజి) నాతో ఈ సంపద అంతా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దేనని మీరు సాక్షిగా ఉండండి. ఆయన ఇష్టమైతే దీనిని ఖర్చు చేయవచ్చు, లేదా తన వద్దే ఉంచుకోవచ్చు అని అన్నారు. ప్రవక్త గారి ఆందోళనను దూరం చేయడం కోసం ఆమె ఆ సంపదనంతటినీ ఇచ్చేస్తూ సరే, మీరు నిశ్చింతగా ఖర్చు చేయండి అని చెప్పారు.

ఒక వ్యక్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఏదో ఒకటి అడిగాడు. ప్రవక్త గారు ప్రస్తుతం నా వద్ద ఏమీ లేదు. నువ్వు నా పేరు మీద వస్తువులను కొనుగోలు చేయి, నా వద్దకు ధనం వచ్చినప్పుడు నేను దానికి ధర చెల్లిస్తానని అన్నారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఓ దైవ ప్రవక్తా! మీరు అతనికి ఇదివరకే ఇచ్చి ఉన్నారు. మీ శక్తికి మించిన విషయానికి అల్లాహ్ మిమ్మల్ని బాధ్యుడిగా చేయలేదు కదా అని మనవి చేశారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నకు హజ్రత్ ఉమర్ గారి ఈ మాట నచ్చలేదు. అంతలో అన్సార్‌లలోని ఒక వ్యక్తి ఓ దైవ ప్రవక్తా! మీరు ధారాళంగా ఖర్చు చేయండి, ఆకాశ సింహాసనాధిపతి అయిన ఆ అల్లాహ్ తరపు నుండి పేదరికం వస్తుందని భయ పడకండని అన్నాడు. ఆ అన్సారీ మాటలకు ప్రవక్త గారు చిరునవ్వు నవ్వారు, ఆయన ముఖంలో సంతోషం స్పష్టంగా కనిపించింది. ఆపై ఆయన (స) నాకు కూడా ఇదే ఆజ్ఞాపించబడిందని అన్నారు.

ఒకసారి ఒక అనుచరుడు (రజి) దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు కొన్ని ఖర్జూరాలు, దోసకాయలను కానుకగా సమర్పించాడు. అదే సమయంలో ప్రవక్త గారి వద్దకు బహ్రెయిన్ నుండి బంగారు ఆభరణాలు వచ్చాయి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ ఖర్జూరాలు, దోసకాయలకు ప్రతిఫలంగా ఒక గుప్పెడు నిండా బంగారు ఆభరణాలను అతనికి ప్రసాదించారు.

ఎవరైనా అప్పులతో మరణించి, ఆ అప్పు తీర్చడానికి ఎటువంటి ఆస్తిని వదలివెళ్లకపోతే, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముస్లింలను ఉద్దేశించి మీరు మీ సోదరుని అంత్యక్రియల నమాజ్ చదవండని ఆదేశించేవారు. అలాగే ఆయన (స) నేను ముస్లింలకు వారి బంధువుల కంటే కూడా సన్నిహితుడను. కావున విశ్వాసులలో ఎవరైనా మరణించి, అప్పులు మిగిల్చిపోతే, వాటిని తీర్చే బాధ్యత నాదే. ఒకవేళ అతను ఏదైనా ఆస్తిని వదలివెళితే, అది అతని వారసులకు చెందుతుందని అనేవారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి అప్పుల చెల్లింపునకు సంబంధించి హుజూరె అన్వర్ హజ్రత్ బిలాల్ రజియల్లాహు అన్హు ఒక సుదీర్ఘ ఉల్లేఖనాన్ని సమర్పించారు. అందులో అల్లాహ్ తఆలా తన వైపు నుండి అసాధారణమైన రీతిలో అప్పు తీర్చడానికి మార్గాలను సుగమం చేశాడు. అప్పులన్నీ పూర్తిగా తీరిపోయిన తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లన్నారు. ఓ బిలాల్! అప్పులన్నీ చెల్లించిన తర్వాత మిగిలిన సంపదను పేదలకు పంచిపెట్టు. ఆ రాత్రి ప్రవక్త గారు మసీదులోనే గడిపారు, తన ఇంటికి వెళ్ళలేదు. మరుసటి రోజు ప్రవక్త గారు అడగ్గా, హజ్రత్ బిలాల్ రజియల్లాహు అన్హు సంపద అంతా ఖర్చయిపోయిందని చెప్పారు. అప్పుడు ప్రవక్త గారు అల్లాహ్ వైభవాన్ని, స్తుతిని కొనియాడారు. ఆ తర్వాతే ఆయన (స) తన సతీమణుల వద్దకు ఇంటికి వెళ్ళారు.

హ్రజత్ ఇబ్నె ఉమర్ రజియల్లాహు అన్హు ఇట్లు ఉల్లేఖించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జుబైర్ రజియల్లాహు అన్హు గుర్రం ఎంత వరకు పరిగెత్తగలదో అంతవరకు ఆయనకు జాగీరు ఇవ్వవలసిందిగా ఆదేశించారు. గుర్రం పరిగెత్తి ఒకచోట ఆగిపోగా, హజ్రత్ జుబైర్ రజియల్లాహు అన్హు తన కొరడాను విసిరారు, అది కొంతదూరం వెళ్ళి పడింది. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇతని కొరడా ఎక్కడివరకు వెళ్లి పడిందో అక్కడివరకు భూమిని ఇచ్చేయండని ఆదేశించారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లు ప్రవచించారు. ఒకసారి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన ఇంటికి వచ్చి మన ఇంట్లో ఏముంది? అని అడిగారు. హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా రెండు అష్రఫీలను (బంగారు నాణేలను) తీసి ఇస్తూ ఇవే ఉన్నాయని చెప్పారు. ప్రవక్త గారు ఆ అష్రఫీలను తన అరచేతిలో పెట్టుకుని ఇలా అన్నారు: తన వెనుక రెండు బంగారు నాణేలను వదిలి వెళ్ళే ప్రవక్త పరిస్థితి ఏమి కానుంది? అని అంటూ ఆ క్షణమే ఆ అష్రఫీలను పంచిపెట్టేశారు.

హునైన్ యుద్ధంలో ఆరు వేలు లేదా ఎనిమిది వేల మంది బానిసలు, ఇరవై నాలుగు వేల ఒంటెలు, నలభై వేలకు పైగా గొర్రెలు-మేకలు, నాలుగు వేల ఊకియా (నాలుగు వందల తొంభై కిలో గ్రాములు) వెండి యుద్ధ సంపదగా లభించాయి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ యుద్ధ సంపద పంపిణీని మనుషులను ఆకట్టుకోవడంతో ప్రారంభించారు. వీరు అరబ్ దేశపు పెద్ద మనుషులు మరియు తమ తమ తెగలలో గౌరవ, ఉన్నతమైన స్థానాన్ని కలిగి ఉండేవారు. ప్రవక్త గారు వారిని ఆత్మీయులను చేసుకోవడానికి ఆ సంపదను ప్రసాదించారు. ఈ సందర్భంగా ప్రవక్త గారు అబూ సుఫ్యాన్ మరియు అతని కుమారులకు ఎంతటి సంపదను ప్రసాదించారంటే, అబూ సుఫ్యాన్ భావోద్వేగంతో ఇలా అన్నారు: ఓ దైవ ప్రవక్తా! మీరు అత్యంత దయాళువులు. నా తల్లిదండ్రులు మీపై త్యాగమగుదురు గాక! నేను మీతో యుద్ధాలు చేశాను, మీరు ఎంతటి ఉత్తమ యోధులో చూశాను. అలాగే నేను మీతో సంధి చేసుకున్నాను, మీరు ఎంతటి ఉత్తమ సంధి కర్తో కూడా తెలుసుకున్నాను.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లు ప్రవచించారు. ఒకసారి దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద చాలా ఎక్కువ సంఖ్యలో గొర్రెలు, మేకలు ఉండెను. ఒక అవిశ్వాసి అది చూసి మీ వద్ద ఎంతటి అపారమైన గొర్రెలు, మేకలు ఉన్నాయంటే, రోమ్ మరియు పర్షియా చక్రవర్తుల వద్ద కూడా ఇంత సంపద ఉండదని అన్నాడు. ప్రవక్త గారు ఆ క్షణంలోనే వాటన్నింటినీ అతనికి దానం చేసేశారు. ఆ వెంటనే అతను ఒక ప్రవక్త తప్ప మరెవ్వరూ ఇంతటి మహోన్నతమైన దాతృత్వాన్ని ప్రదర్శించలేరని విశ్వసిస్తూ ఇస్లాం స్వీకరించాడు.

హునైన్ యుద్ధం జరిగిన రోజున ఒక మహిళ వచ్చి కొన్ని పద్యాలు చదివింది, వాటిలో బనూ హవాజిన్ తెగలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బాల్యపు పాలు తాగిన రోజుల ప్రస్తావన కూడా ఉంది. ప్రవక్త గారు ఆ పద్యాలను విని బనూ హవాజిన్ తెగకు చెందిన సంపదనంతటినీ వారికే తిరిగి ఇచ్చేశారు, దాంతో పాటు వారికి అదనంగా మరో ఐదు లక్షల దిర్హములు విలువైన సంపదను కూడా ప్రసాదించారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మహోన్నతమైన నైతిక గుణాలను ప్రస్తావిస్తూ హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లు ప్రవచించారు: వారిలో అత్యున్నత స్థాయి సమతుల్యత ఉండేది. ప్రతి నైతిక గుణం కూడా దానికి తగిన సమయం మరియు సందర్భాన్ని బట్టి వ్యక్తమయ్యేది. ఆయన ప్రదర్శించిన ఈ ఉత్తమ గుణాలలో ఆయన దాతృత్వం, త్యాగనిరతి మరియు అనుగ్రహం ఇవన్నీ కూడా సందర్భోచితంగా, సరైన స్థానంలోనే వ్యక్తమయ్యేవి.

హుజూరె అన్వర్ ఇట్లన్నారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలు ఏ విధంగానైతే సమతుల్యంగా ఉంటాయో, అదే విధంగా ఆయన ప్రతి పని కూడా దానికి అనుగుణంగానే సమతుల్యంగా ఉండేది. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవిత చరిత్రలోని ప్రతి కోణాన్ని లోతుగా గ్రహిస్తూ దాని ప్రకారం నడుచుకోవడానికి అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! ఆమీన్.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا ۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ۔